నాలా పరీవాహక ప్రాంతాల ప్రజలు
అప్రమత్తంగా ఉండాలి

- వర్షాలు పడిన సమయంలో సెల్లార్లలోకి ఎవరూ వెళ్లవద్దు
- పలు పార్టీ నేతల సూచన



దోమలగూడ శివప్యాలెస్ లేన్‌లో జాగ్రత్తగా ఉండాలని నాలా పరీవాహక ప్రాంతాల ప్రజలకు సూచనలు చేస్తున్న బీజేపీ నేతలు

కవాడిగూడ, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): నగరంలో కురుస్తున్న భారీవర్షాల కారాణంగా నాలా పరీవాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బీజేపీ రాష్ట్ర నాయకులు జి.వెంకటేష్, నగర నాయకులు ఎంసీ.మహేందర్‌బాబు. బీజేపీ డివిజన్ అధ్యక్షుడు సలంద్రి దిలీప్‌యాదవ్ సూచించారు. ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి కవాడిగూడ డివిజన్ దోమలగూడలోని శివప్యాలెస్ లైన్ నాలాకు ఆనుకొని ఉన్న కాలనీవాసులును కలిసి వారు ఎదుర్కొన్న సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఒక అపార్ట్‌మెంట్ సెల్లార్‌లో నడుంలోతు వరదనీరు చేరడంతో వారు ఉదయం వరకు అనేక ఇబ్బందులు పడ్డారని తెలిపారు. వెంటనే విషయం తెలుసుకున్న బీజేపీ నేతలు సంఘటనా స్థలానికి చేరుకొని మునిపిల్ ఏఈ వినోద్‌ఫోన్ ద్వారా సమాచారం అందించారు. వారు ఎదుర్కొంటున్న సమస్యలు వెంటనే పరిష్కరించాలని కోరారు. దీంతో వారు హైడ్రా సిబ్బంది, జీహెచ్‌ఎంసి సిబ్బందిని రప్పించి సెల్లార్‌లో నిలిచిపోయిన వరదనీటిని బయటకు తీయించి, సమస్యలను పరిష్కరించారు. వర్షం పడిన సమయంలో సెల్లార్లలోకి ఎవరూ వెళ్లవద్దని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర మహిళా నాయకురాలు ఆర్.పద్మారెడ్డి, పరిమళ్‌కుమార్, అపార్ట్‌మెంట్ వాసులు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో.....

కవాడిగూడ శివప్యాలెస్ లేన్‌లో సెల్లార్‌లో అపార్ట్‌మెంట్ సెల్లార్‌లోకి వరద నీరు వెళ్లి ఇబ్బందులు పడుతున్న స్థానికులను సోమవారం బీఆర్‌ఎస్ కవాడిగూడ డివిజన్ ప్రదానకార్యదర్శి ఎన్‌డీ.సాయికృష్ణ, హనుమాన్ దేవాలయ మాజీ ఛైర్మన్ జి రాజశేఖర్‌గౌడ్, నాయకులు శ్రీకాంత్(లడ్డు) పరామర్శించారు. వారు ఎదుర్కొంటున్న సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. వెంటనే సెల్లార్‌లో పేరుకుపోయిన నీటిని తొలగించి అపార్ట్‌మెంట్ వాసులు, నాలా పరీవాహక ప్రాంతాల ప్రజల సమస్యలను పరిష్కరించాలని వారు కోరారు.



వినోభానగర్‌లో కూలిన నాలా ప్రహరీ దిమ్మెలను తొలగిస్తున్న జీహెచ్‌ఎంసీ సిబ్బంది



వినోభా నగర్‌లో దినేష్ కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎమ్మెల్యే ముఠా గోపాల్



వినోభానగర్‌లో ఏసీపీ రమేష్ కుమార్‌తో మాట్లాడి వివరాలు తెలుసుకుంటున్న ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్



బాధితులకు నిత్యవసరాలను పంపిణీ చేస్తున్న బీఆర్‌ఎస్ యువ నాయకుడు జైసింహ, హరిబాబు యాదవ్, దీన్‌దయాల్‌రెడ్డి

24 గంటలైనా లభించని యువకుడి ఆచూకీ

హైడ్రా, జీహెచ్‌ఎంసీ అధికారుల గాలింపు చర్యలు



ప్రేయర్‌పవర్ చర్చ్ వద్ద నాలాలో చిక్కుకున్న వాహనాన్ని పరిశీలిస్తున్న హైడ్రా కమిషనర్ రంఘనాథ్



పార్శిగుట్ట వద్ద దినేష్‌ను వెతకడానికి నాలాలోకి దిగుతున్న హైడ్రా సిబ్బంది

ముషీరాబాద్, సెప్టెంబర్ 15 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ ఆదివారం రాత్రి కురిసిన భారీవర్షానికి వరద పోటెత్తడంతో.. వినోభా నగర్‌లో నాలాలో కొట్టుకుపోయిన వ్యక్తి ఆచూకీ 24గంటలు అయినా లభించలేదు. బాధితుని కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. హైడ్రా, జీహెచ్‌ఎంసీ అధికారులు తమ సిబ్బందితో నాలాలో క్షుణ్ణంగా గాలించినా ఆచూకీ లభించకపోవడంతో అధికారులు సైతం ఇబ్బంది పడ్డారు. వినోభా నగర్‌కు చెందిన దినేష్(సన్నీ)(24) భార్య రాజశ్రీ, మూడు సంవత్సరాల కార్తిక్ ఉన్నారు. దినేష్ పెస్ట్ కంట్రోలర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఆదివారం రాత్రి భారీ వర్షం కురుస్తుండడంతో దినేష్ తన ద్విచక్రవాహనాన్ని నాలా ప్రహరీ పక్కన పార్కు చేస్తుండగా నాలాలో వరద ఉధృతికి ఉన్నఫలంగా ప్రహరీ కూలిపోయింది. అదే సమయంలో తన ద్విచక్రవాహనం కిందపడుతున్న సమయంలో వాహనాన్ని పట్టుకునే క్రమంలో దినేష్ వాహనంతో సహా నాలాలో పడి కొట్టుకుపోయాడు. నాలో ఉన్న ఓ పైపును పట్టుకుని రక్షించండి రక్షించడండి అని కేకలు వేశాడు. ఈ దృశ్యాన్ని చూసిన స్థానికులు తాడు వేసి రక్షించేందుకు ప్రయత్నించినప్పటికీ వరద ఉధృతి తీవ్రంగా ఉండడంతో నాలాలో కట్టుకుపోయాడు.

ఆదివారం రాత్రి నుంచి సోమవారం వరకు వినోభా నగర్ నుంచి ప్రేయర్‌పవర్ చర్చ్, ఆశీర్వాద్ అపార్టుమెంట్ అడిక్‌మెట్ మీదుగా ముషరంబాగ్ వరకు వెతికినా ఆచూకీ లభించలేదు. ప్రేయర్ పవర్ చర్చ్ సమీపంలో ఉన్న నాలాపై కప్పు తెరిచి చూడగా దినేష్ ద్విచక్రవాహనం కనిపించింది. ఇక్కడే నాలాలో ఉండవచ్చని జీహెచ్‌ఎంసీ, హైడ్రా సిబ్బంది కచ్చా నాలా మ్యాన్‌హోల్స్ ఒక్కొక్కటి తెరుస్తూ అందులోకి దిగి టార్చ్ లైట్ సహాయంతో వెతికినప్పటికీ ఆచూకీ లభించలేదు. విషయం తెలుసుకున్న ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యే ముఠా గోపాల్, బీఆర్‌ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ, కార్పొరేటర్ సుప్రియానవీన్‌గౌడ్ అధికారులకు సమాచారం అందించారు. జీహెచ్‌ఎంసీ కమిషనర్ కర్ణన్, హైడ్రా కమిషనర్ రంఘనాథ్, జీహెచ్‌ఎంసీ చీఫ్ ఇంజనీర్ రత్నాకర్, ఎస్‌సీ ఆశలత, డీఈ వినయ్, ఈఈ శ్రీనివాస్ రెడ్డి, ఏఈ మురళీ, డీఎంసీ రఘునంధన్‌రెడ్డి నాలాలను పరిశీలించారు.

నాలా ఆక్రమణలను కూల్చివేస్తాం : హైడ్రా కమిషనర్

వినోభానగర్ నాలాపై ఆక్రమణ తీవ్రత వల్లే సమస్య ఉత్పన్నమయ్యిందని హైడ్రా కమిషనర్ రంఘనాథ్ పేర్కొన్నారు. వినోభానగర్ నాలాను కమిషనర్ సందర్శించి మాట్లాడుతూ.. స్థానికంగా నాలాను ఆక్రమించి స్కూల్ భవనం, గృహనివాసాలు కట్టడం వల్ల సమస్య తీవ్రమయ్యిందన్నారు. వీటిని తొలగించేందుకు హైడ్రా చర్యలు తీసుకుంటుందన్నారు. కమర్షియల్‌గా నిర్మించిన కట్టడాల యజమానులపై కేసులు నమోదు చేస్తామన్నారు. సమస్య పరిష్కారానికి నివేదిక రూపొందించి, జీహెచ్‌ఎంసీ అధికారులకు అందజేస్తామని పేర్కొన్నారు.

సమస్య పరిష్కరించకుండా సినిమా చూపిస్తున్న హైడ్రా : బీజేపీ

హైడ్రా సమస్యలు పరిష్కరించకుండా ప్రజలకు సినిమా చూపిస్తున్నదని జీహెచ్‌ఎంసీ బీజేపీ ఫ్లోర్ లీడర్ నర్సింహారెడ్డి ఆరోపించారు. కార్పొరేటర్ సుప్రియా నవీన్‌గౌడ్‌తో కలిసి బీజేపీ కార్పొరేటర్లు రవిచారి, బండారు శ్రీవాణి, శ్రావణ్ కుమార్ తదితరులతో కలిసి నాలాను పరిశీలించారు. ఈ సందర్భంగా నర్సింహారెడ్డి మాట్లాడుతూ... ప్రతి నాలా వద్ద అక్రమ కట్టడాలు వెలిసినప్పటికీ హైడ్రా చర్యలు తీసుకోవడం లేదన్నారు. కాంగ్రెస్ నాయకులు చెప్పిన ప్రకారమే నడుచుకుంటుందని ఆరోపించారు. అధికారుల నిర్లక్ష్యం వల్లే సమస్య ఏర్పడిందన్నారు. అధికారులు సమస్యలపై నిత్యం సమావేశాలు నిర్వహిస్తే ప్రజలకు ఇబ్బందులు ఉండవుకదా అని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ముషీరాబాద్ నియోజకవర్గం జాయింట్ కన్వీనర్ ఎం.నవీన్ గౌడ్, డివిజన్ అధ్యక్షుడు కంచి ముదిరాజ్, నాయకులు పాల్గొన్నారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం రూ.20లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని సీపీఎం నగరకార్యదర్శి వర్గ సభ్యుడు ఎం.దశరత్, జోన్‌కార్యదర్శి ఆర్.వెంకటేష్, సభ్యులు పద్మ, పాషా డిమాండ్ చేశారు.



బాధితులతో మాట్లాడుతున్న జీహెచ్‌ఎంసీ ఫ్లోర్ లీడర్ నర్సింహారెడ్డి, కార్పొరేటర్లు సుప్రియా నవీన్‌గౌడ్, రవిచారి

బాధిత కుటుంబాలకు నిత్యావసరాలు పంపిణీ

వినోభా నగర్‌లో వరద ఉధృతి వల్ల స్థానికంగా ఉన్న 50 ఇండ్లలోకి వరదనీరు రావడంతో బాధితులకు బీఆర్‌ఎస్ ముషీరాబాద్ సీనియర్ నాయకుడు దీన్‌దయాల్‌రెడ్డి ఆధ్వర్యంలో బియ్యం, పప్పు, నూనె తదితర సరుకులను పంపిణీ చేశారు. బీఆర్‌ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహతో పాటు సీనియర్ నాయకుడు ఎడ్ల హరిబాబు యాదవ్, తలారి శ్రీకాంత్ ముదిరాజ్ తదితరులు బాధితులకు సరుకులు అందజేశారు.

బాధిత కుటుంబానికి రూ.50లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి : ఎమ్మెల్యే ముఠా గోపాల్

వినోభానగర్‌లో వరద నీటి తాకిడికి నాలాలో కొట్టుకుపోయిన దినేష్ కుటుంబానికి రూ.50లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని ఎమ్మెల్యే ముఠా గోపాల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పేద కుటుంబానికి చెందిన బాధితుని భార్యకు ప్రభుత్వ ఉద్యోగం, పక్కా గృహం కేటాయించాలని కోరారు. బాధితుని భార్య, అతని తల్లిదండ్రులను ఎమ్మెల్యే పరామర్శించి, ధైర్యం చెప్పారు. ఎమ్మెల్యే వెంట బీఆర్‌ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ, రాష్ట్ర నాయకుడు ఎడ్ల హరిబాబు యాదవ్, బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీధర్‌రెడ్డి, ఆకుల అరుణ్‌కుమార్, పార్టీ సీనియర్ నేత శివముదిరాజ్, దీన్‌దయాల్‌రెడ్డి, నాయకులు తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకుంటుంది : ఎంపీ

పేద కుటుంబానికి చెందిన దినేష్ కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ అన్నారు. దినేష్ కుటుంబాన్ని ఎంపీ పరామర్శించి, మాట్లాడుతూ.. దినేష్ నాలాలో కొట్టుకుపోవడం బాధాకరం అన్నారు. వారి కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో ముషీరాబాద్ కాంగ్రెస్ అధ్యక్షుడు పెండం శ్రీనివాస్ యాదవ్, మాజీ కార్పొరేటర్ ఆర్.కల్పనయాదవ్, నియోజకవర్గం బీ-బ్లాక్ ఉపాధ్యక్షుడు పట్నం నాగభూషణంగౌడ్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పుకార్లు.. షికార్లు..

వినోభానగర్ నాలాలో కొట్టుకుపోయిన దినేష్ ఆచూకీ లభించిందని జోరుగా పుకారులు వినిపించాయి. ప్రేయర్ పవర్ చర్చ్ నాలాలో కనిపించాడని, ఆశీర్వాద్ అపార్టుమెంట్, అడిక్‌మెట్, ముషరంబాగ్‌లో కనిపించాడని పుకార్లు జోరుగా వినిపించాయి. ఎక్కడ చూసినా ఇదే విషయంపై చర్చించుకోవడం కనిపించింది. చిక్కడపల్లి ఏసీపీ రమేష్ కుమార్, సీఐ రాంబాబు, డీఐ నదీమ్, ఎస్సైలు ముందు జాగ్రత్త చర్యగా వినోభానగర్ నుంచి పార్శిగుట్ట వరకు భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

దోబీఘాట్‌లో వరదనీటి సమస్య పరిష్కారం

చిక్కడపల్లి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆదివారం రాత్రి 2 గంటల పాటు కురిసిన భారీ వర్షానికి హుస్సేన్‌సాగర్‌నాలా పరీవాహక ప్రాంతాలైన దోబీఘాట్‌లో సోమవారం బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంటు నియోజకవర్గం జాయింట్‌కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్ తదితర ఆ పార్టీ నాయకులు విస్తృతంగా పర్యటించారు. దోబీఘాట్‌తోపాటు అశోక్‌నగర్, బాపునగర్, సబర్మతినగర్, అరుంధతినగర్ బస్తీల్లో గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనివినయ్‌కుమార్ సూచనల మేరకు వారు పర్యటించి స్థానికులను కలిసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ మేరకు కార్పొరేటర్‌తో మాట్లాడిన వారు జీహెచ్‌ఎంసీ ఇంజనీరింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ మహేష్‌తో మాట్లాడి సిబ్బందిని రప్పించి నీట మునిగిన దోబీఘాట్‌లో వరదనీటిని తొలగించారు. అదేవిధంగా అశోక్‌నగర్ వద్ద నిలిచిపోయిన వరదనీటిని హుస్సేన్‌సాగర్ నాలాలోకి వెళ్లే విధంగా ఏర్పాట్లు చేయించారు. ఏమైనా ఇబ్బందులంటే 7799819991కు ఫోన్ చేయాలన్నారు.

భాషాపండితుల మెప్పు పొందిన గురజాడ



మాట్లాడుతున్న కోలేటి దామోదర్‌గుప్తా, పక్కన కళా జనార్ధనమూర్తి తదితరులు

చిక్కడపల్లి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆధునిక భాషలో ముత్యాల సరాలు రాసిన గురజాడ అప్పారావు నాటి భాషాపండితుల మెప్పు పొందారని పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కోలేటి దామోదర్‌గుప్తా అన్నారు. అభ్యుదయ సాహిత్య యుగకర్త గురజాడ అప్పారావు అని ప్రముఖకవి డా.సి.నారాయణరెడ్డి తన పరిశోధనాగ్రంథంలో పేర్కొన్న అంశాన్ని ఆయన గుర్తుచేశారు. సోమవారం త్యాగరాయ గానసభ అధ్వర్యంలో ఎందరో మహానుభావులు కార్యక్రమాల పరంపరలో భాగంగా గురజాడ అప్పారావు యాదిలో పేరిట సంస్మరణ సమావేశం గానసభ అధ్యక్షుడు కళాజనార్ధనమూర్తి అధ్యక్షతన జరిగింది. కార్యక్రమంలో ప్రముఖ కవి రఘుశ్రీ, గాయనీమణులు ఎస్.శ్రీదేవి, టి.సీత పాల్గొన్నారు.

లక్ష్మణరేఖ హీరో, హీరోయిన్, దర్శకనిర్మాతకు సన్మానం

చిక్కడపల్లి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): లక్ష్మణరేఖ సినిమా విడుదలై 50 సంవత్సరాలు పూర్తిచేసుకున్న సందర్భంగా ఆ సినిమా హీరో మురళీమోహన్, హీరోయిన్ జయసుధతోపాటు నిర్మాత, దర్శకుడు లక్ష్మణరేఖ గోపాలకృష్ణను సోమవారం సన్మానించారు. ఇట్ క్లా సంస్థ నిర్వాహకుడు డా.కె.ధర్మారావు వారిని సన్మానించారు. ప్రముఖ సినీనిర్మాత తుమ్మలపల్లి రామసత్యనారాయణ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది.

17న శ్రీవిరాట్ విశ్వకర్మ యజ్ఞమహోత్సవం

బర్కత్‌పుర, సెప్టెంబరు, 15 (ఆంధ్రజ్యోతి): విశ్వకర్మ భగవానుడి జయంతి సందర్భంగా ఈనెల 17న శ్రీవిరాట్ విశ్వకర్మ యజ్ఞమహోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలంగాణ విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ మాతృసంఘం ప్రధానకార్యదర్శి చోల్లేటి కృష్ణమాచార్యులు తెలిపారు. ఉప్పల్ భగాయత్‌లోని విశ్వబ్రాహ్మణ ఆత్మగౌరవ భవన సముదాయంలో ఈ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సోమవారం బర్కత్‌పురలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

3కే నమో యువ రన్‌ను విజయవంతం చేయాలి

ముషీరాబాద్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ రహిత సమాజ స్థాపనకు ఈ నెల 21న సాయంత్రం 7గంటలకు నెక్లస్ రోడ్‌లో నిర్వహించే 3కే నమో యువ రన్‌ను విజయవంతం చేయాలని బీజేపీ మహాకాళి జిల్లా అధ్యక్షుడు భరత్‌గౌడ్ విజ్ఞప్తి చేశారు. ముషీరాబాద్ వాలీబాల్ హాల్‌లో బీజేవైఎం నియోజకవర్గం కన్వీనర్ గడ్డం నవీన్ ఆధ్వర్యంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు.

కార్మిక కమిషనరేట్ ఎదుట సేల్స్‌రిప్స్ ధర్నా

చిక్కడపల్లి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వం దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉంచిన తమ న్యాయమన సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఫెడరేషన్ ఆఫ్ మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌ఎంఆర్‌ఏఐ)యూనియన్ ప్రధానకార్యదర్శి భానుకిరణ్ డిమాండ్ చేశారు. ఎఫ్‌ఎంఆర్‌ఏఐ పిలుపు మేరకు సోమవారం దేశవ్యాప్త ధర్నాలో భాగంగా సేల్స్‌రిప్స్ ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లోని కార్మికకమిషనర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు రాజుభట్, దుర్గాప్రసాద్, విద్యాసాగర్, శ్రీనివాస్, సదానందచారి తదితరులు పాల్గొన్నారు. అనంతరం అదనపు కమిషనర్ గంగాధర్‌కు వినతిపత్రం సమర్పించారు.

కవితనేతృత్వంలో జాగృతిని బలోపేతం చేస్తాం

చిక్కడపల్లి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రానున్న రోజుల్లో కవిత ఆదేశాలను పాటిస్తూ జాగృతిని అన్ని విధాలుగా బలోపేతం చేస్తామని ఇటలీ అధ్యక్షుడు తానింకి కిషోర్‌యాదవ్ అన్నారు. ఈ సందర్భంగా కవితతో సోమవారం కిషోర్‌యాదవ్ భేటీ అయ్యారు. కలిసిన అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలను జాగృతి ద్వారా ప్రపంచానికి కవిత పరిచయం చేశారని ప్రశంసించారు.

ఘనంగా మ్యూజిక్ డ్యాన్స్ ఫెస్టివల్

రాంనగర్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కల్చరల్ ఫైన్ ఆర్ట్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నగరంలోని బిర్లామందిర్ భాస్కర ఆడిటోరియంలో సోమవారం 9వ నేషనల్ డ్యాన్స్ అండ్ మ్యూజిక్ చాంపియన్‌షిప్ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా కేంద్ర మాజీమంత్రి సముద్రాల వేణుగోపాలచారి, చినుకు కల్చరల్ సొసైటీ ప్రధానకార్యదర్శి పీఎస్‌ఎన్.మూర్తి, ఇండో కెనడియన్ యూత్ కౌన్సిల్ వ్యవస్థాపకులు, బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఆర్.శేషసాయి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా డ్యాన్స్‌లో ప్రతిభ కనబరిచిన వారికి ముఖ్యఅతిథులు బహుమతులను అందజేసి ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పి.అనూహ్యారెడ్డి, డాక్టర్ బాబులాల్, నిర్వాహక సంస్థ అధ్యక్షుడు ప్రభాకర్ పలువురు ప్రముఖులు సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

వృద్ధుడి అదృశ్యం

బర్కత్‌పుర, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రైలులో వృద్ధుడు అదృశ్యమైన సంఘటన కాచిగూడ రైల్వే పీఎస్‌లో జరిగింది. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం... అరుణాచలం(84) కుటుంబ సభ్యులతో కలిసి నాగర్‌సోల్ వెళ్లడానికి చెన్నైలో నాగర్‌సోల్ ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కాడు. రైలు కాచిగూడకు వచ్చే సరికి అరుణాచలం కనిపించకుండా పోయాడు. ఆయన అన్న కుమారుడు నారాయణ కాచిగూడ రైల్వే పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

బర్కత్‌పుర, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. కాచిగూడ రైల్వే హెడ్ కానిస్టేబుల్ సమ్మయ్య తెలిపిన వివరాల ప్రకారం.. గుర్తుతెలియని వ్యక్తి (65) ఉందానగర్ రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫారం నెంబర్4పై అనారోగ్యంతో చనిపోయి ఉన్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. రైల్వే పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బీజేపీలో చేరిన గోవింద్




జేపీ.నడ్డా సమక్షంలో బీజేపీలో చేరిన జాతీయ బీసీ యువజన సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ చిటికెల గోవింద్

రాంనగర్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): బీజేపీ జాతీయ అధ్యక్షుడు జే.పీ.నడ్డా సమక్షంలో ఎంపీ ఆర్.కృష్ణయ్య, ఏపీ బీజేపీ అధ్యక్షుడు మాధవ్ నేతృత్వంలో జాతీయ బీసీ యువజన సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ చిటికెల గోవింద్ సోమవారం ఢిల్లీలో బీజేపీలో చేరారు. జేపీ నడ్డా ఆయనకు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా గోవింద్ మాట్లాడుతూ బీజేపీ సిద్ధాంతాలు, ప్రధాని మోదీ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితుడినై బీజేపీలో చేరినట్లు తెలిపారు.

చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వం విఫల్యం

రాంనగర్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఎడతెరపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలకు తగు రక్షణ కల్పించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షుడు పి.సాయిబాబా ఆరోపించారు. సోమవారం పార్టీ నగర కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నగరంలో వర్షం వచ్చిందంటే మోరీలు, నాలాలు నిండిపోయి ప్రజలు నరకం పాలవుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు నల్లెల కిషోర్, బాల్‌రాజ్‌గౌడ్, ఎస్.ప్రకాష్, వినోద్, సుక్రవేది తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ప్రెస్ అకాడమీకి షోయబుల్లాఖాన్ పేరుపెట్టాలి: సీపీఐ



కాచిగూడ లింగంపల్లి చౌరస్తాలో షోయబుల్లాఖాన్ చిత్రపటానికి నివాళులర్పించిన సీపీఐ జిల్లా కార్యదర్శి స్టాలిన్ తదితరులు

బర్కత్‌పుర, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రెస్అకాడమీకి షోయబుల్లాఖాన్ పేరు పెట్టాలని సీపీఐ జిల్లాకార్యదర్శి స్టాలిన్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ సాయుధ పోరాటాల వార్షికోత్సవాల సందర్భంగా సోమవారం కాచిగూడలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కమతం యాదగిరి ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా షోయబుల్లాఖాన్‌ను చంపిన కాచిగూడ లింగంపల్లి చౌరస్తాలో షోయబుల్లాఖాన్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ షోయబుల్లాఖాన్ సేవలను కొనియాడారు. సీపీఐ నాయకులు కె.శ్రీనివాస్, మహ్మద్ సలీం, రాజ్‌కుమార్, జంగయ్య, కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

టీయూసీఐ నూతన కమిటీ ఎన్నిక

నల్లకుంట, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా(టీయూసీఐ) హైదరాబాద్, రంగారెడ్డి ఉమ్మడి జిల్లాల నూతన అధ్యక్షుడిగా వి.ప్రవీణ్, కార్యదర్శిగా కేఎస్.ప్రదీప్‌ను ఎన్నుకున్నట్లు టీయూసీఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కె.సూర్యం, ఎస్.ఎల్.పద్మ ప్రకటించారు. సోమవారం విద్యానగర్‌లోని మార్క్స్‌భవన్‌లో నూతన కమిటీ ఎన్నికైంది. టీయూసీఐ నూతన కమిటీ ఉపాధ్యక్షులుగా లింగంగౌడ్, నల్లన్న, కార్యదర్శులుగా ఎస్.శ్రీనివాస్, డి.లక్ష్మి, కోశాధికారి సత్యనారాయణలతోపాటు మరో 12 మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్ష, కార్యదర్శులు వి.ప్రవీణ్, కె.ఎస్.ప్రదీప్ మాట్లాడుతూ కనీస వేతనం రూ26 వేలు అమలుచేయాలని, కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు.

బ్రాహ్మణుల హక్కుల సాధనకు కృషి

నల్లకుంట, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): బ్రాహ్మణుల హక్కుల సాధన కోసం తెలంగాణ రాష్ట్ర బ్రాహ్మణ సంఘం సమైక్య ఏకైక లక్ష్యంతో పనిచేస్తుందని సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు పోచంపల్లి రమణారావు పేర్కొన్నారు. న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి శాశ్వత పరిష్కారానికి సంకల్పంతో ముందడుగు వేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. సోమవారం నల్లకుంటలోని సంస్థ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర బ్రాహ్మణ సంఘ సమైక్య ప్రచారకార్యదర్శిగా నియమితులైన గుడా జయరాంను ఆయన ఘనంగా సత్కరించారు.

జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఏడుగురు

ముషీరాబాద్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ విద్యామండలానికి చెందిన వివిధ పాఠశాలల్లో విద్యాబోధన చేస్తున్న ఏడుగురు ఉపాధ్యాయులు జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. నల్లకుంట ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు జి.భాగ్యలక్ష్మి, ఎం.రవీందర్, ముషీరాబాద్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు రఘునందన్, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు ఆస్రాఫాతిమా, కవాడిగూడ ఉపాధ్యాయురాలు హేమ, వారాసిగూడ ఉపాధ్యాయురాలు మాలతి, సీతాఫల్‌మండి బాలిక పాఠశాల ఉపాధ్యాయుడు శ్రీనివాస్‌రావు ఎంపికయ్యారు. వీరికి ఈనెల 16న నాంపల్లిలోని స్టాండ్లీ పాఠశాలలో సన్మానం ఉంటుందని ముషీరాబాద్ విద్యామండలి డిప్యూటీ డీఈవో శ్రావణ్‌కుమార్, ఐఓఎస్‌లు స్వరూపారాణి, జయలక్ష్మి తెలిపారు.

సామాజికసేవలో అశోక్‌నగర్ వెల్ఫేర్ కృషి గొప్పది

చిక్కడపల్లి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): సామాజికసేవా కార్యక్రమాల్లో అశోక్‌నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ చేస్తున్న కృషి గొప్పదని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. రెండురోజులపాటు జరిగిన అశోక్‌నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ వార్షికోత్సవాలు సోమవారం ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా ముగింపు సభలో పాల్గొన్న ఎమ్మెల్యేను నిర్వాహకులు సన్మానించారు.

రేవంత్‌రెడ్డి రాజీనామా చేయాలి : ఎంఆర్‌పీఎస్

కవాడిగూడ , సెప్టెంబఱ 15 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులు, వృద్ధులు వితంతువులు, ఒంటరి మహిళలకు పెన్షన్‌ను పెంచి ఇస్తామన్నా హామీని అమలు చేయకుండా మోసం చేసిన సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం వీహెచ్‌పీఎస్, ఎంఎస్పీ, ఎంఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో లోయర్ ట్యాంక్‌బండ్‌లోని ముషీరాబాద్ తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా వీహెచ్‌పీఎస్, నాయకులు ఎల్.గోపాల్, కొల్లి నాగేశ్వర్‌రావు, వెంకటస్వామి, మాట్లాడుతూ హామీ ఇచ్చి 20 నెలలు గడుస్తున్నా నేటికీ పెంచకపోవడం పెన్షన్‌దారులను మోసం చేయడమే అన్నారు. ఈ సందర్భంగా ముషీరాబాద్ తహసీల్దార్ రాణాప్రతాప్‌సింగ్‌కు వినతి పత్రం అందజేశారు.